రొమ్ము క్యాన్సర్

ప్రపంచ పోరు



రొమ్ము క్యాన్సర్.. ఆధునిక మహిళకు తొలి శత్రువు! ప్రపంచవ్యాప్తంగా ఏటా కొన్ని లక్షల మంది స్త్రీల ప్రాణాలను హరిస్తున్న ఈ క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు ఇప్పుడు 'విశ్వ' ప్రయత్నం జరుగుతోంది. 'స్క్రీనింగ్' ప్రధాన అస్త్రంగా.. యావత్ ప్రపంచం ఉధృత పోరాటం సాగిస్తోంది. ఈ వరసలో మనమూ ఉద్యమిస్తుండటం.. గొప్ప ముందడుగు! బిడియాన్ని ఛేదించి.. అనుభవాలే ప్రాతిపదికగా.. జీవన పోరాటానికి నేటి స్త్రీ అడుగులు కదుపుతుండటం.. కొత్త శకానికి నాంది!

# స్క్రీనింగ్ అస్త్రం విశ్వ ప్రయత్నం

రొమ్ము క్యాన్సర్‌పై విజయం సాధించాలంటే దానికి ఒక్కటే అస్త్రం. రొమ్ముల్లో క్యాన్సర్ ఆనవాళ్లను ఎంత త్వరగా గుర్తిస్తే.. అంత సంపూర్ణంగా నయం చెయ్యటం.. ముదిరిన కొద్దీ బాధాకరమైన చికిత్సలు తప్పవు, ప్రాణాలకూ ముప్పు పెరుగుతుంది. అందుకే యావత్ ప్రపంచం ఇప్పుడు 40 ఏళ్ల పైబడిన ప్రతి స్త్రీ.. క్రమం తప్పకుండా ఏడాదికి ఒకసారి 'మామోగ్రఫీ' పరీక్ష చెయ్యాలని ప్రయత్నిస్తోంది. ఇది రొమ్ములకు తీసే ఎక్స్-రే పరీక్ష. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు ఎప్పటి నుంచో ఈ స్క్రీనింగ్ పరీక్షను ఒక పద్ధతి ప్రకారం ప్రోత్సహిస్తున్నాయి. కేవలం ఈ స్క్రీనింగ్ కారణంగానే రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా పట్టింది.. ప్రాణాలు దక్కించుకున్న అమెరికా రాయబారి మల్ఫోర్డ్ సతీమణి **జీన్ మల్ఫోర్డ్** తన స్వీయ అనుభవాలను 'సుఖీభవ' పాఠకులతో పంచుకుంటున్నారు. (పక్క బాక్స్ చూడండి)

ఈ ప్రపంచవ్యాప్త చైతన్యం ఇప్పుడు మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఊపందుకుంటోంది. స్వయంగా గైనకాలజిస్ట్ అయ్యుండి కూడా తన రొమ్ము క్యాన్సర్‌ను కష్టమైనా ఆరంభంలోనే గుర్తించి.. మొక్కవోని ధైర్యంతో దానిపై విజయం సాధించారు హైదరాబాద్‌కు చెందిన **డా॥ ఉషాలక్ష్మి**. ఆమె పేరుతో ఒక ప్రత్యేక ఫౌండేషన్ ఏర్పాటు చేసి ప్రజల్లో రొమ్ము క్యాన్సర్‌పై విస్తృత చైతన్యం తీసుకువచ్చేందుకు ఇటీవలే ప్రత్యేక కృషి ఆరంభించారు **డా॥ రఘురాం**. బ్రెస్ట్ సర్జన్‌గా బ్రిటన్‌లో ఎంతో అనుభవం, ఖ్యాతి గడించిన ఆయన అనుభవాలు, సలహాసూచనల సమాహారాన్ని ఈ వారం మీ ముందుకు తెస్తోంది 'సుఖీభవ'!

# రొమ్ము క్యాన్సర్
## ప్రపంచ పోరు



డా॥ పి.రఘురాం
బ్రెస్ట్ సర్జన్, సీఈఓ, ఉషాలక్ష్మి బ్రెస్ట్‌క్యాన్సర్ ఫౌండేషన్, హైదరాబాద్

'కేవలం రొమ్ములకు సంబంధించిన సమస్యలకే ఆపరేషన్ చేసే బ్రెస్ట్ సర్జన్‌గా నేను బ్రిటన్‌లో ఎంతో అనుభవం గడించాను. అయితే 2002లో స్వయానా మా అమ్మగారికి రొమ్ము క్యాన్సర్ వచ్చినట్టు గుర్తించటం నా జీవితాన్ని కీలకమైన మలుపు తిప్పింది. ఎలాగైనా భారత్ వచ్చి రొమ్ము క్యాన్సర్ బాధితులకు వైద్యసేవలందించాలని నిర్ణయించుకున్నాను. ఈ ఏడాది మా అమ్మగారి పేరుతోనే 'ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్' ప్రారంభించాను. రెడ్డీస్ ఫౌండేషన్, రేకీ-క్యాన్సర్ ఫౌండేషన్ల సంయుక్త సహకారంతో.. రొమ్ము క్యాన్సర్‌పై స్త్రీలలో అవగాహన పెంచేందుకు క్యాన్సర్ ఒక్కటే కాదు, రొమ్ములకు సంబంధించిన సమస్త సమాచారంతో పుస్తకాలు తెస్తున్నాం.

'బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహనా మాసాన్ని' పురస్కరించుకుని మేం ఓ ప్రత్యేక కార్యక్రమం ఆరంభించాం. మామోగ్రఫీ సదుపాయాలున్న ఒక వ్యాన్‌ను ఏర్పాటు చేసి.. ఈ నెలంతా మేం హైదరాబాద్‌లోని వివిధ సంస్థలకు వెళ్లి 40 ఏళ్లు పైబడిన స్త్రీలకు 'మామోగ్రఫీ పరీక్షలు' (స్క్రీనింగ్) నిర్వహించాం. సమాజంలో ముందుగా విద్యావంతుల్లో అవగాహన, చైతన్యం తెస్తే ఆ సమాచారం క్రమేపీ అన్ని వర్గాలకూ విస్తరిస్తుందన్న ఉద్దేశంతో హైదరాబాద్‌లోని సెక్రటేరియట్, రెడ్డీస్ ల్యాబ్స్, జొరాష్ట్రియన్ క్లబ్, విద్యుత్ సౌధ, రామోజీ ఫిల్మ్‌సిటీ, హుడా, ఎన్ఎఫ్‌సీ, ఈసీఐఎల్, స్టేట్ బ్యాంకులు.. ఇలా మా వ్యాన్‌ను రకరకాల సంస్థలకు తీసుకు వెళ్లి.. 500 మంది స్త్రీలకు ఉచితంగా స్క్రీనింగ్ నిర్వహించాం. స్పందన అపూర్వం. ఈ పరీక్షలు చేయించుకున్న వారిలో ఒకరికి చాలా చాలా తొలిదశలోనే క్యాన్సర్‌ను గుర్తించి.. అత్యాధునిక గైడ్‌వైర్ పద్ధతిలో వెంటనే సర్జరీ చేసి తొలగించాం. దీంతో అది పూర్తిగా నయమైపోయినట్లే. ఇక ఆమెకు కీమోథెరపీ, రేడియేషన్ వంటివేమీ అవసరం లేదు. నిజానికి ఆమె స్వయంగా వైద్యురాలు. సైకియాట్రిస్ట్‌గా సేవలందిస్తున్నారు. స్క్రీనింగ్‌కు చాలా అయిష్టంగా వచ్చారు. కానీ గొప్ప మేలు జరిగింది. తరచూ చేసే స్క్రీనింగ్‌తో చేకూరే అమోఘమైన ప్రయోజనం ఇది. నిజానికి మరో ఇద్దరికి కూడా క్యాన్సర్ అని అనుమానంగా ఉంది, పరీక్షలు జరుగుతున్నాయి.

### స్క్రీనింగ్.. ప్రాణాలు కాపాడుతుంది!

బ్రిటన్లో ఏటా రొమ్ములు పరీక్షించే కార్యక్రమం గత 19 ఏళ్లుగా నిరంతరం జరుగుతోంది. ఇప్పటి వరకూ 18 కోట్ల మంది స్త్రీలకు స్క్రీనింగ్ చేసి 1.17 లక్షల క్యాన్సర్ కేసులు గుర్తించారు. 1400 ప్రాణాలు కాపాడారు. ఇలా నిరంతరం నిర్వహించే స్క్రీనింగ్‌తో మరణాల రేటును 30-35% తగ్గించవచ్చని అంచనా వేశారు. సుమారు 500 మందికి స్క్రీనింగ్ చేస్తే ఒక జీవితాన్ని రక్షించవచ్చన్నది బ్రిటన్ అనుభవం చెబుతోంది. సరిగ్గా ఈ నెల రోజుల్లో మా అనుభవం కూడా దాన్నే స్పష్టం చేసింది. ఈ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని క్రమేపీ రాష్ట్రమంతా విస్తరించే ప్రయత్నాల్లో ఉన్నాం.

క్యాన్సర్ గడ్డ చేతికి తగిలినప్పుడు గుర్తిస్తే దానికి చికిత్స చెయ్యొచ్చుగానీ దాన్ని పూర్తిగా నయం చెయ్యలేం. కానీ ఈ స్క్రీనింగ్‌లో బాగా ఇంకా ముందే గుర్తిస్తే దాదాపుగా పూర్తిగా నయం చేసే వీలుంటుంది. చదువుకున్నవాళ్లు, స్వయంగా డాక్టర్లు కూడా స్క్రీనింగ్‌కు రావటానికి సందేహిస్తున్నారు, సంశయిస్తున్నారు, భయపడుతున్నారు. క్యాన్సర్ వచ్చిందంటే- జీవితం అయిపోయినట్టేననీ, రొమ్ములు తీసెయ్యాల్సి వస్తుందనీ, చికిత్సతో జుట్టు రాలిపోతుందనీ.. రకరకాల భయాలు పెట్టుకుంటున్నారు. సత్వరమే గుర్తిస్తే రొమ్ములు తీసెయ్యాల్సిన పని లేదు. పాశ్చాత్య దేశాల్లో ఏటా స్క్రీనింగ్ చేస్తున్నారు కాబట్టి భయాలు తక్కువ. కానీ మన దేశంలో ఇంకా ఈ పరీక్షలు అలవాటు కాలేదు కాబట్టి భయాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని వదిలించుకోవటం, ఏటా పరీక్ష చేయించుకోవటం.. అత్యంత కీలకం

# రొమ్ము క్యాన్సర్

## ప్రపంచ పోరు

- మన దేశంలో పట్టణాల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు బాగా పెరుగుతున్నాయి.
- పాశ్చాత్య దేశాల్లో 50 ఏళ్లు పైబడిన వారిలో రొమ్ము క్యాన్సర్ ఎక్కువ. కానీ ఇక్కడ 40 ఏళ్ల నుంచే పెరుగుతోంది.
- రొమ్ము క్యాన్సర్ పురుషుల్లోనూ రావచ్చు!

"నెలక్రితం బ్రిటన్ వెళ్లాను. మరో పది రోజుల్లో తిరిగి వచ్చేస్తాననగా నా రొమ్ములో ఏదో తేడాగా అనిపించింది. మా అబ్బాయికి చెప్పాను. వెంటనే పరీక్షలు చేయించాం. 48 గంటల్లోపు అది క్యాన్సర్ అని నిర్ధారించారు.. అంతే, నాకు లోకమంతా ఒక్కసారిగా తల్లకిందులైనట్టనిపించింది. ఎంతకాలం బతుకుతానో తెలీదు. స్వయంగా డాక్టర్‌ను అయ్యుండి కూడా ఎలా గుర్తించలేకపోయానని బాధ. అంతా అయోమయంగా అనిపించింది. ఆ సమయంలో అక్కడి 'బ్రెస్ట్ కేర్ నర్స్' నా దగ్గరకు వచ్చి ఎన్నో విషయాలు చెప్పింది. రొమ్ము క్యాన్సర్ బాధితులు ఎంతోమంది చికిత్స తర్వాత హాయిగా జీవిస్తున్నారని ధైర్యం చెప్పింది. నిజానికి అవన్నీ నాకు తెలిసిన సంగతులే. కానీ ఆమె ద్వారా వింటున్నప్పుడు ఎంతో ధైర్యం వచ్చింది. తర్వాత చిన్నచిన్న పుస్తకాలు తెచ్చిచ్చింది. అవి చదివినప్పుడు ఎంత ధైర్యం వచ్చిందో చెప్పలేను. స్వయంగా డాక్టర్నైన నాకే ఈ పుస్తకాలు ఎంతో విశ్వాసాన్నిస్తే ఇక సామాన్య స్త్రీలకు ఇంకెంత ఉపయోగపడతాయో కదా అనిపించింది. వెంటనే మన వాళ్లందరికీ ఇలాంటి పుస్తకాలు తప్పనిసరిగా అందుబాటులోకి తేవాలని మా అబ్బాయికి చెప్పాను. తను ఎంతో కృషి చేసి, ఆ పుస్తకాలు ముద్రించేందుకు అనుమతి తెచ్చాడు. ఇప్పుడు నా పేరు మీదే ఉషాలక్ష్మి ఫౌండేషన్ ప్రారంభించి పుస్తకాలతో పాటు స్క్రీనింగ్, చికిత్సల వంటివన్నీ చేస్తున్నాము. ఇది స్త్రీలకు ఎంతో ఆత్మవిశ్వాసాన్నిచ్చే కార్యక్రమం. ఆలస్యం చెయ్యకూడదని బ్రిటన్లోనే ఆపరేషన్ చేయించుకుని వెంటనే భారత్ వచ్చేశాను. ప్రతి స్త్రీ.. క్రమం తప్పకుండా చెకప్‌కు వెళ్లి.. జీవితాన్ని కాపాడుకోవటం చాలా ముఖ్యమని గుర్తించాలి. సంకోచాల్లేకుండా వచ్చి పరీక్ష చేయించుకోవాలంటే స్త్రీలకు సంగతులు తెలియాలి. అందుకు చిన్నచిన్న పుస్తకాలాంటివి ఎంతో ఉపయోగపడతాయి. అందుకే ఆ దిశగా కృషి చేస్తున్నాం."



**డా॥ ఉషాలక్ష్మి**

ప్రముఖ గైనకాలజిస్ట్. ప్రొఫెసర్‌గా నిలోఫర్ ఆసుపత్రిలో ఎంతో కాలం సేవలందించారు. రొమ్ము క్యాన్సర్‌పై విజయం సాధించిన ఆమె అనుభవం

■ వంశపారంపర్య చరిత్ర ■ 11 ఏళ్ల కంటే ముందే రజస్వల కావటం ■ మరీ పెద్దవయసులో గానీ నెలసరి నిలిచిపోకపోవటం ■ ఊబకాయం ■ పిల్లల్లేకపోవటం ■ మొదటి గర్భం చాలా లేటు కావటం ■ తల్లిపాలివ్వకపోవటం...

**ఇవన్నీ రొమ్ము క్యాన్సర్ ముప్పు పెంచేవే!**